క్లుప్తంగా

సీపీఎల్ టోర్నీ పోస్టర్ ఆవిష్కరణ



టోర్నీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న బాలకృష్ణ

పెదగంట్యాడ: ఏఎస్‌ఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో పెదగంట్యాడలో వచ్చే నెల 14 నుంచి సౌత్ ఇండియా క్రికెట్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్ పోస్టర్‌ను గాంధీనగర్ హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కాతా బాలకృష్ణ గాంధీనగర్‌లో బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

సామాన్యులపై విద్యుత్ చార్జీల భారం

గాజువాక : విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సీపీఐ నాయకులు గాజువాకలో బుధవారం కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకుడు జి.ఆనంద్ ఆధ్వర్యంలో చినగంట్యాడ, కణితి రోడ్‌లలో షాపులకు, వ్యాపారులకు కరపత్రాలను అందజేశారు. ఆనంద్ మాట్లాడుతూ విద్యుత్‌చార్జీల పెంపుతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం పడిందన్నారు. ఈ పెంపును నిరసించాలని కోరారు. దీనిపై ఈ నెల 15 వరకు ఈ ప్రచారం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అప్పారి విష్ణుమూర్తి, కె.అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాట ఉత్సవం



రాట ఉత్సవంలో పాల్గొన్న తుంగ్లాం గ్రామస్తులు

అక్కిరెడ్డిపాలెం: దసరా పండగను పురస్కరించుకుని 69వ వార్డు తుంగ్లాంలోని శ్రీ విజయరాఘవ స్వామి ఆలయం వద్ద బుధవారం పందిరి రాట మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ నెల 15వ తేదీ నుంచి శ్రీ దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి, గ్రామ నాయకులు దూడ పాపారావు, కొల్లి అప్పల రెడ్డి, కొల్లి కుంచారావు, మద్ది అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రీడా పోటీల్లో ప్రతిభ



పతకంతో అప్పారావు

పెదగంట్యాడ: సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ (ఎస్‌బీకేఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు నేపాల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ క్రీడా పోటీల్లో గంగవరానికి చెందిన అప్పారావు సత్తా చాటారు. స్టీల్‌ప్లాంట్ సీఎంఎం విభాగానికి చెందిన వాడమదుల అప్పారావు 59 కిలోల విభాగంలో డెడ్ లిఫ్ట్, స్క్వాడ్ 140 కిలోలు, బెంచ్ 70 కిలోలు, పవర్ లిఫ్టింగ్ సీనియర్ విభాగంలో 350 కిలోల బరువు ఎత్తి బంగారు పతకం సాధించారు. అప్పారావును నేపాల్ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రతినిధులు, పెదగంట్యాడకు చెందిన పలువురు క్రీడాకారులు అభినందించారు.

పోలీసుల అదుపులో మరో ఆరుగురు

కూర్మన్నపాలెం: వివాదాస్పద స్థలంలో అలజడి సృష్టించిన ఘటనలో మరో ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కూర్మన్నపాలెం సర్వే నంబర్ 39/1సీలో 1.06 ఎకరాల స్థలంలో మంగళవారం సాయంత్రం ఓ వర్గానికి చెందిన వారు 100మంది రౌడీమూకతో చొరబడి రేకుల ప్రహరీని ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. దీంతో దువ్వాడ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని రౌడీ మూకలను చెదరగొట్టడంతో పాటు ముగ్గురిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బుధవారం మరో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. పూర్తిస్థాయిలో విచారించి కేసుకు సంబంధించిన విషయాలను సమగ్రంగా వెల్లడిస్తామని తెలియజేశారు.

అన్ని వార్డుల అభివృద్ధే లక్ష్యం



77వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్



71వ వార్డులో శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, కార్పొరేటర్ రామారావు

- శివారు ప్రాంతాల్లోనూ మౌలిక వసతుల కల్పన
- మేయర్ గొలగాని హరివెంకట కుమారి
- రూ.1.40 కోట్లతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన

పెదగంట్యాడ: జీవీఎంసీ పరిధిలోని అన్ని వార్డుల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. 77వ వార్డు పరిధి మదీనాబాగ్, కేవిఎస్ పాలెం, దేవాడ, ఈసరపువాని పాలెం గ్రామాల్లో సుమారు రూ.1కోటి 40 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో కలసి బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో మేయర్ మాట్లాడారు. నగరానికి దూరంగా ఉన్న 77వ వార్డులో మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. మదీనాబాగ్‌లో రూ.20 లక్షలతో రోడ్లు, కాల్వలు, కేవిఎస్ పాలెంలో రూ.20 లక్షలతో రోడ్లు, కాల్వలు, దేవాడలో రూ.20 లక్షలతో కాల్వలు, ఈసరపువాని పాలెంలో రూ.60లక్షలతో కాల్వలు, రోడ్లు, సామాజిక భవనం, గొరుసువాని పాలెంలో రూ.20 లక్షలతో రోడ్లు, కాల్వలు, కల్వర్టు నిర్మించనున్నామని తెలిపారు. ఇప్పటికే ఈ వార్డులోని పలు ప్రాంతాలను అభివృద్ధి చేశామని తెలిపారు. వార్డులో ఇప్పటి వరకు ప్రారంభించిన పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేశామన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తామని చెప్పారు. అన్ని ప్రాంతాల అభివృద్ధి, పేదల సంక్షేమం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ మాట్లాడుతూ వార్డును అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. సమస్యలుంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు ప్రసాద్‌బాబు, సురేష్ వార్డు నాయకులు ఎంపీ రెడ్డి, కె.శివకుమార్, దావూద్, కురం అప్పారావు ఈసరపు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

71వ వార్డులో రూ.71లక్షలతో అభివృద్ధి పనులు

గాజువాక : నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు అత్యంత ప్రాధాన్యత కల్పించామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 71వ వార్డులోని వివిధ ప్రాంతాల్లో రూ.71 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లో ప్రజలు కోరిన సౌకర్యాలను సమకూర్చుతున్నామన్నారు. ప్రతీ వార్డులో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, సీసీ కాల్వలు, కొండవాలు ప్రాంతాల్లో మెట్ల మార్గాలు, రిటైనింగ్ వాల్ తదితర నిర్మాణాలను చేపట్టామని, ఇప్పటికే కొన్ని పనులు పూర్తయ్యాయని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను చేపడతామన్నారు. కార్పొరేటర్ రాజాన రామారావు మాట్లాడుతూ రూ.9 లక్షలతో శ్రీనగర్ రామాలయం ఆర్చి వద్ద సీసీ రోడ్, కాల్వ నిర్మాణం, రూ.9.50 లక్షలతో శ్రీరామ్‌నగర్‌లో సీసీ రోడ్, కాల్వల నిర్మాణం, రూ.18 లక్షలతో ఉప్పర కాలనీలో సామాజిక భవన ప్రహరీ, రిటైనింగ్ వాల్ నిర్మాణం, రూ.15 లక్షలతో అరుణోదయ కాలనీలో రిటైనింగ్ వాల్ నిర్మాణం, రూ.19.50 లక్షలతో దిబ్బపాలెం పైడితల్లి అమ్మవారి ఆలయం వెనుక సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

దసరా సంచిక ఆవిష్కరణ



దసరా సంచికను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

గాజువాక : గాజువాక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న దేవీ నవరాత్రుల సంచికను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం పెద్దలు మాట్లాడుతూ దసరా సంచిక విశిష్టతను వివరించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉత్సవాలను ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గుంపున గురునాథ గుప్త, నాయకులు గునిశెట్టి అప్పల సత్యనారాయణ గుప్త, ఏవీఎస్ఎన్ గుప్త, పబ్బతి సూర్యనారాయణమూర్తి, కోట గోపాలరావు పాల్గొన్నారు.

2 నుంచి ఖోఖో పోటీలు

గాజువాక : వచ్చే నెల 2 నుంచి 4వ తేదీ వరకు గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంఘం (జిప్సా) పరిధిలోని పాఠశాలల విద్యార్థినులకు ఖోఖో పోటీలను నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు తెలిపారు. బుధవారం నిర్వహించిన జిప్సా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పోటీలకు ప్రతీ స్కూల్ నుంచి రెండు జట్లు మాత్రమే పాల్గొనాలన్నారు. 6, 7 తరగతుల నుంచి పాల్గొనే విద్యార్థులు జూనియర్స్‌గా, 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు సీనియర్స్ జట్టుగా నమోదు చేసుకోవాలని సూచించారు. పాల్గొనదలచిన జట్లు ఈ నెల 30 లోగా నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు నవంబర్ 10న బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

రహదారి భద్రతపై స్కౌట్స్ అండ్ గైడ్స్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, ట్రాఫిక్ పోలీసులు, విద్యార్థులు

పెదగంట్యాడ: రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు. పాఠ్య పుస్తకాల్లో తాము చదివిన పాఠాలను, నేర్చుకున్న విషయాలను అందరికీ తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. పెదగంట్యాడ న్యూపోర్టు ట్రాఫిక్ స్టేషన్ వద్ద మానవ హారంగా ఏర్పడ్డారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, వేగం కంటే ప్రాణం ముఖ్యం అంటూ నినాదాలు చేశారు. ట్రాఫిక్ ఎస్‌ఐ రాజు మాట్లాడుతూ విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన రావడం అభినందనీయమన్నారు. సేవా నిరతి, దేశం పట్ల ప్రేమను విద్యార్థి దశ నుంచే అలవర్చేది స్కౌట్స్ అండ్ గైడ్స్ మాత్రమేనని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్, హిందుస్తాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యాయుడు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో ముగిసిన క్యాంప్



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న కేవీ వాల్తేర్ ప్రిన్సిపాల్ కమల్‌జీత్

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయం వాల్తేర్‌లో సోమవారం ప్రారంభమైన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్ బుధవారంతో ముగిసింది. ఉదయం సర్వమత ప్రార్థనలు చేశారు. అనంతరం ఫ్లాగ్ బ్రేక్, రాత పరీక్ష, లాగ్ బుక్స్ తనిఖీలు నిర్వహించారు. 11 స్కూళ్ల నుంచి పాల్గొన్న సుమారు 200 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్ మాట్లాడుతూ స్కౌట్ అండ్ గైడ్స్ కలిగి ఉండవలసిన క్రమశిక్షణ, చురుకైన భాగస్వామ్యం ప్రతీ ఒక్కరూ కలిగి ఉన్నారని ప్రశంసించారు. చివరిగా స్కౌట్ అండ్ గైడ్ పతాకం అవనతం చేశారు. క్యాంప్‌లో పాల్గొన్న వారందరికీ ఆయన ప్రశంసాపత్రాలు అందజేసి కార్యక్రమాన్ని ముగించారు.

మేయర్‌కు వినతి



మేయర్‌కు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు జగ్గరాజుపేటలోని వార్డు సచివాలయానికి సొంత భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ మేయర్ గొలగాని హరివెంకట కుమారికి వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. మేయర్‌ను బుధవారం ఆమె నివాసం వద్ద కలిసిన నమ్మి శ్రీనివాస్ ప్రసాద్, మాడిశ అప్పలరాజు ఈ మేరకు వినతి పత్రం అందించారు. కాపు జగ్గరాజుపేట, యాదవ జగ్గరాజుపేట ప్రాంతాలు ఒకే సచివాలయ పరిధిలో ఉండడం, సొంత భవనం లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు.

టోల్‌గేటు తొలగించాలి

నగరవాసులకు భారంగా మారిన అగనంపూడి టోల్ ప్లాజాను వెంటనే తొలగించాలని కోరుతూ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు సేనాపతి శంకరరావు, బలిరెడ్డి సత్యనారాయణ మేయర్ హరివెంకటకుమారికి వినతిపత్రం సమర్పించారు.

స్టీల్‌ప్లాంట్‌లో బ్యాంకర్ల సమావేశం



బ్యాంకర్స్ మీట్‌లో ప్రసంగిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో బుధవారం బ్యాంకర్స్ మీట్ నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ అధ్యక్షతన పరస్పర అభివృద్ధికి ఆర్థిక సంస్థల మద్దతును కోరుతూ ఉక్కు అడ్మినిస్ట్రేషన్ భవనంలో బ్యాంకర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎండీ భట్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రయాణంలో ఆర్థిక సంస్థలు అవసరమైన నిధులు, ఆర్థిక నైపుణ్యాన్ని అందించడం ద్వారా కీలకపాత్ర పోషించాయన్నారు. తమకు మద్దతు ఇస్తున్న బ్యాంకర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బ్యాంక్ ప్రతినిధులు ప్లాంట్‌లోని పలు ఉత్పత్తి విభాగాలను సందర్శించి అక్కడ ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐడీబీఐ, ఇండియన్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంక్‌లకు చెందిన సీనియర్ అధికారులతో పాటు స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు డి.కె. మొహంతి, ఎస్.సి.పాండే, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

వైభవంగా నృసింహుడికి ఆర్జిత సేవలు



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం నిర్వహించారు. ఆలయ బేడామండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

- శ్రీ వరావరా లక్ష్మీనృసింహస్వామికి బుధవారం సహస్ర నామార్చన నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. 1001 నామాలతో స్వామికి తులసితో అర్చన చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. భక్తులకు తులసి ప్రసాదం అందజేశారు.

బాలికలను కాపాడుకుందాం



బాలికల హక్కులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రదీప్, వైద్య సిబ్బంది

పెదగంట్యాడ: అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని జీవీఎంసీ 77వ వార్డు దేవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలను కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం గురించి అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. బాలికల హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కె.అన్నపూర్ణ, శ్రీనివాసరావు, గోపాలం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా గుడివాడ గురునాథరావు జయంతి



గుడివాడ గురునాథరావు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న గుడివాడ నాగమణి, మంత్రి అమర్‌నాథ్



పార్కు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్ తదితరులు

అక్కిరెడ్డిపాలెం: మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు జయంతిని ఆయన స్వగ్రామం మిందిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మింది జెడ్పీ హైస్కూల్ పక్కనున్న గురునాథరావు విగ్రహానికి ఆయన భార్య గుడివాడ నాగమణి.. కుమారుడు, రాష్ట్ర మంత్రి అమర్‌నాథ్ పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మిందిలోని గుడివాడ అప్పన్న కల్యాణ మండపం వద్ద గుడివాడ అప్పన్న మెమోరియల్ ట్రస్ట్ నిధులు రూ.4 లక్షలతో నిర్మించిన పార్క్‌ను వారు ప్రారంభించారు. అనంతరం పార్క్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మంత్రి అమర్‌నాథ్ భార్య హిమగౌరి, గురునాథరావు సోదరుడు, మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుడివాడ అప్పల రామమూర్తి, కార్పొరేటర్ గుడివాడ అనూష, వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, స్టీల్ వైఎస్సార్ టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, నాయకులు సంగ్రాన నూకరాజు, వరదాడ వెంకటరమణ, బోనెల జోసెఫ్, శ్యామ్‌బాబు, నంబారు రాజు, రెడ్డిపల్లి చిట్టిబాబు, ఈటి సురేష్, రొక్కం వెంకటరావు, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఈటి శ్రీరాములు, ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

నేడు మిందిలో ‘జగనన్న ఆరోగ్య సురక్ష’



సిబ్బందికి సూచనలు ఇస్తున్న జెడ్సీ సింహాచలం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మిందిలోని గుడివాడ అప్పన్న కల్యాణ మండపంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో జోనల్ కమిషనర్ పి.సింహాచలం బుధవారం కల్యాణ మండపాన్ని పరిశీలించారు. 68వ వార్డు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ ప్రియాంక, అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిబిరంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

1500 మందికి టోకెన్లు

శిబిరంలో 68వ వార్డు పరిధిలో 6 సచివాలయాలు, 69వ వార్డులో 3 సచివాలయాలకు సంబంధించి సుమారు 1500 మందికి వైద్యసేవలు అందించేందుకు సిబ్బంది టోకెన్లు అందించారని వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ తెలిపారు. ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, గైనిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, కంటి వైద్యనిపుణులు సుమారు 10 నుంచి 15మంది హాజరై వైద్యసేవలు అందిస్తారన్నారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు.

పిల్లల చదువుపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం ఆంజనేయ

అక్కిరెడ్డిపాలెం: పిల్లల చదువుపై తల్లిదండ్రులు మరింతగా దృష్టి సారించాలని మింది జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయ కోరారు. పాఠశాలలో బుధవారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌ను ఎక్కువగా వినియోగించడం వల్ల వారి సమయం చాలా వృథా అవుతోందన్నారు. జీవితాలు నాశనమయవుతున్నాయన్నారు. విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఉన్నత శిఖరాలు అధిరోహించిన మేధావులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



మంత్రి అమర్‌నాథ్‌తో భెల్ యునైటెడ్ ఫ్రంట్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ విశాఖపట్నం యూనిట్ గుర్తింపు యూనియన్ యునైటెడ్ ఫ్రంట్ నాయకులు మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మిందిలోని మంత్రి నివాసంలో బుధవారం ఆయన్ను కలిసి, పలు విషయాలను చర్చించారు. మంత్రిని కలిసిన వారిలో గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు బొండ బాబూరావు, ప్రధాన కార్యదర్శి సుభాకర్ సాహు, డీటీయూ గౌరవ అధ్యక్షుడు టి.ఎల్.నర్సింగరావు, ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకుడు గవర వెంకటరమణారావు ఉన్నారు. అనంతరం గుడివాడ గురునాథరావు జయంతిని పురస్కరించుకుని నివాళులర్పించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదల పాలిట వరం

ఎమ్మెల్యే నాగిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పరవాడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల పాలిట వరమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. లంకెలపాలెం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే నాగిరెడ్డి ప్రారంభించారు. శిబిరంలో ప్రశాంతి నగర్, పెదమడక, ఫార్మాసిటీ, బీసీ కాలనీ, కొండయ్యవలస, దిబ్బపాలెం, శివాజీనగర్, పినమడక సచివాలయాలకు చెందిన ప్రజలు వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ పేదలకు పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ వైద్యం అందించే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. ప్రభుత్వం సమకూర్చిన కళ్లద్దాలను ఎమ్మెల్యే నాగిరెడ్డి రోగులకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్సీ పి.సింహాచలం, 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, బొడ్డ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం చిన్నచూపు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు కార్మికులు నిద్రాహారాలు మాని పోరాటం చేస్తున్నా కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్రప్రభుత్వ పెద్దలు ఎందుకింత చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 972వ రోజు బుధవారం సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని కార్మికులు, సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు కోరుతున్నారన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో కేంద్రానికి ఈ ప్రాంత ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, పార్లమెంట్‌లో ఉపసంహరణ బిల్లును ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.